ప్రజాశక్తి
శనివారం 21 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.డి గయాజుద్దీన్ శుక్రవారం తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.50వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తారని వివరించారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తామని చెప్పారు. అభ్యర్థులు jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తును నమోదు చేయాలని పేర్కొన్నారు. పోర్టల్‌లో దరఖాస్తులను నవంబర్ 4లోగా నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

రైతులను ఎండగట్టి... కాలువలో పూనుగట్టి

- చేపల చెరువులకు అక్రమంగా నీటి బట్టి..
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న విఆర్ఎస్ అధికారులు

చీమంత చినుకు పడిన చాలు కొండంత నష్టం నుంచి గట్టెక్కవచ్చని ఓవైపు ఆకాశం వైపు ఆత్రంగా చూస్తున్న అన్నదాత.. మరోవైపు కాలువలు చెంత ఉన్నా చుక్క నీరందక శివారు ఆయకట్టు రైతన్న ఆందోళన చెందుతుంటే.. దర్జాగా ప్రాజెక్టుకు కిలోమీటరు దూరాన కాలువలో పూనుగట్టి నీటిని అక్రమంగా చేపల చెరువులకు పట్టుకెళ్తున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళ్తే...

ఎడమ ప్రధాన కాలువకు అడ్డుకట్ట వేయడంతో నిల్వ ఉన్న నీరు

ప్రజాశక్తి - మక్కువ

మండలం లోని వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువలో అక్రమంగా అడ్డంగా గట్టు వేసి నీటిని సమీపంలో ఉన్న చేపల చెరువులకు తీసుకుపోతున్నారు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఇలా అక్రమాలు జరుగుతున్నప్పటికీ అధికారులెవరూ పట్టించుకోక పోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. సుమారు 20 ఎకరాల్లో చేపల చెరువులో ఈ ప్రాంతంలో ఉన్నాయి. అయితే వాటిని వినియోగించాల్సిన విద్యుత్ మోటార్లు పనిచేయలేదని స్థానిక కూలీలు తెలుపుతున్నారు. పూను వేసి నీటిని దిగువ ప్రాంతంలో కొంతమంది శంబర గ్రామానికి చెందిన రైతులు కూడా ఇలాగే తీసుకుపోతున్నారని వారు అంటున్నారు. ఇప్పటికే శివారు భూమి రైతులకు సాగునీరందక అవస్థలు పడుతున్నారు. చాలీచాలని నీటితో రైతులు కొట్లాడుకుంటూ సాగునీటిని వినియోగించుకుంటున్నారు. అయితే అక్రమదారులకు మాత్రం అధికారులు సాగు కోసం వినియోగించాల్సిన నీటిని అవినీతికి అలవాటు పడి చేపల చెరువులకు వదిలేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎల్ఎంసి కాలువకు లైనింగ్ పనులు లేకపోవడం, మరోవైపు కాలువలు పూర్తిగా పూడికపేరుకుపోవడం శివారు ఆయకట్టు భూములకు నీరందక మార్కొండపుట్టి, బంగారువలస, కోన పంచాయతీ రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా కాలువల్లో అడ్డుకట్టలు తొలగించి దొంగచాటుగా సాగునీటిని వినియోగిస్తున్న వారిపైనా, కాలువలపై పర్యవేక్షణ కొరవడిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పామాయిల్ తోటలో ఉంచి చేపల చెరువులకు వెళ్తున్న నీరు

ఉపాధ్యాయుల దీక్షలకు పలువురి మద్దతు

దీక్షా శిబిరానికి మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీశ్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సిపిఎస్, జిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు చేపట్టిన నిరాహార దీక్షలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. రెండో రోజు శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ తమ నాయకులతో కలిసి దీక్షా శిబిరానికి వచ్చి నిరాహార దీక్షల శిబిరంలో కూర్చొని తన మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రావాలని కుట్రలో భాగంగా సిఎం జగన్ ఎన్నో అలవికాని వాగ్దానాలను పలు వర్గాల ప్రజలకు ఇచ్చి వారిలో ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని విమర్శించారు. ఇందులో వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానన్న వాగ్దానం ఒకటి అని తెలిపారు. న్యాయమైన డిమాండ్లతో దీక్షలు చేస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. దీక్షలకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మద్దతు తెలిపారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, మహిళా సబ్ కమిటీ కన్వీనర్ ఎన్.నిర్మల ,పార్వతీపురం యూనియన్ గౌరవ అధ్యక్షులు జి.వెంకటరమణ, అధ్యక్ష కార్యదర్శులు సింహాచలం, మల్లేష్ శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి మాట ఇచ్చి వెనుకకు తీసుకున్నందుకు నిరసనగా పార్వతీపురం- విశాఖపట్నం రహదారిపై వెనక్కు నడుస్తూ వినూత్న రీతిలో తమ నిరసనలు తెలిపారు. దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయుల ఆరోగ్యం క్షీణిస్తుందని పరీక్షలు చేసిన వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలకు జనసేన నాయకులు ఆరిక మోహన్‌రావు మద్దతు తెలిపారు.

ఉద్యోగుల స్పందనకు 5 దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఉద్యోగుల స్పందనకు వచ్చే వినతులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులపై, తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 5 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి టివిఎస్ సుధాకర్, జిల్లా కార్మిక అధికారి రామకృష్ణారావు, పంచాయతీ రాజ్ డిఇ గంగాధర్, విద్యాశాఖ అధికారి ఎం.రమాజ్యోతి, ట్రెజరీ అధికారి ఆదిత్య సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేటగానివలస-తంగ్లాం మధ్య రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రహదారులతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి

ప్రజాశక్తి - పాచిపెంట

రహదారుల నిర్మాణంతో గిరిజనుల అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని మారుమూల గిరిశిఖర ప్రాంతంలో నిర్మిస్తున్న రహదారులను పరిశీలించేందుకు శుక్రవారం కలెక్టర్ విస్తతంగా పర్యటించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా మండలంలోని వేటగాని వలస తంగ్లాం రోడ్ నుండి మూటకూడు వరకు అంచనా విలువ రూ.618 లక్షల వ్యయంతో సుమారు 5.8 కిలోమీటర్ల మేరకు ఆర్‌పిపిఎల్‌డబ్ల్యువి కింద నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్ నిర్మాణ పనుల వివరాలను పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.మల్లికార్జున్‌ను అడిగితెలుసుకున్నారు. రహదారుల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణాలకు అవసరమైన అటవీ అనుమతులు పొందివున్నం దున పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా నీటి ప్రవాహంతో రహదారులు దెబ్బతినకుండా బెర్మ్‌ల నిర్మాణాలను ప్రత్యేక శ్రద్ధతో నాణ్యతా ప్రమాణాలు అనుసరించి చేపట్టాలన్నారు. కల్వర్టు నిర్మాణాలపై ఆరా తీయగా 15 సింగిల్ పైప్, 2 రెండు వరుసల నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అనుకూల సమయం అయినందున పనులను ప్రణాళికా బద్ధంగా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల ప్రజల రాకపోకలకు, రవాణా సౌకర్యాలు కలిగేలా వీలైనంత త్వరగా పూర్తిస్థాయిలో రహదారులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పనులు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాతుమూరులో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రాజశేఖర్, పంచాయితీరాజ్ శాఖ డిఇ చిన్నం నాయుడు, ఆర్ఐ రమణ, గుత్తేదారు శేషారెడ్డి, పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన ట్యాంకర్... స్తంభించిన ట్రాఫిక్

కిలోమీటర్ల మేర నిలిచిన భారీ వాహనాలు

ప్రయాణికులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద శుక్రవారం భారీ ట్యాంకర్ మరమ్మతులకు గురైంది. దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటు అంబేద్కర్ జంక్షన్ నుంచి నడుకూరు దాటి అటు అంబేద్కర్ జంక్షన్ నుండి చిదిమి జంక్షన్ వరకూ భారీ వాహనాలు కిలోమీటర్ల దూరంలో నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎంవి రమణ రంగంలోకి దిగి ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లను అంబేద్కర్ జంక్షన్ నుండి ఇరిగేషన్ కార్యాలయం మీదుగా వట్టిగెడ్డ వంతెనకు, ఇటు పార్వతీపురం అటు పాలకొండ వెళ్లేందుకు వాహనాలను మళ్లించడంతో ప్రయాణికులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నట్లు అయింది. ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ వాహనాలు నిలిచిపోవడం వల్ల ఆయా ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నత్తతో పోటీపడుతున్న రహదారి పనులు

మేజర్ పంచాయతీ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. ఒట్టిగెడ్డ నుండి స్వామి థియేటర్ వరకూ సుమారు 1.2 కిలోమీటర్ దూరం ఉపాధి హామీ నిధులు రూ.5.5 కోట్లతో చేపడుతున్నారు. ఈ మేరకు గతేడాది ఫిబ్రవరి 19న ప్రధాన రహదారి విస్తీర్ణం అభివృద్ధి పనులకు అంబేద్కర్ జంక్షన్ వద్ద స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శంకుస్థాపన చేసి వీరఘట్టం గ్రామాన్ని కేంద్ర బిందువుగా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించలేదు. ఈ పనులు నత్తతో పోటీపడుతున్నట్లు స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా భారీ వాహనాల రాకపోకల వల్ల ధుమ్మూ, ధూళి రేగిపోవడంతో రహదారికి ఇరువైపులా ఉన్న వర్తకులు, కూరగాయల వ్యాపారులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు జరుగుతాయనడంతో ఎంతో సంబరపడ్డ మండల ప్రజలపై ఆశలపై నీళ్లు చల్లినట్లు అయిందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎంతో చరిత్ర, పేరు గల వీరఘట్టం నేడు సమస్యలతో సతమతమవుతుందంటే పాలకుల పనితీరు ఏవిధంగా ఉందో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చును. ఇప్పటికైనా పాలకులు ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులపై దృష్టి సారించి రహదారి పనులు వేగవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బారులు తీరిన భారీ వాహనాలు

ఉమ్మడి అభ్యర్థి గెలుపే ముఖ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గానికి చెందిన టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తున్న అభ్యర్థి గెలుపే ముఖ్యంగా కలిసి పనిచేయాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. పట్టణంలోని ఎస్ఎన్ఎంనగర్‌లో గల శత్రుచర్ల బంగ్లాలో శుక్రవారం జరిగిన సమావేశంలో కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, జనసేన నాయకులు బాబు పోలూరు ఆధ్వర్యాన కలిసి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పనిచేసి ఉమ్మడి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు పోవాలని నిర్ణయించారు.

గుమ్మలక్ష్మీపురం : కురుపాం నియోజకవర్గంలో టిడిపి, జనసేన పొత్తుతో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి కోరారు. జియమ్మ వలస మండలం చిన మేరంగికోటలో మాజీమంత్రి విజయ రామరాజు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన నాయకులు సమావేశమ య్యారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో కలిసికట్టుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించారు. సమావేశంలో జనసేన నాయకులు బాబు పోలూరు, టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, నందివాడ కష్ణ బాబు, మధుసూదన్ రావు, వెంకటనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన విద్యను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సాధికార సంస్థ ద్వారా రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సాధికార సంస్థ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంలోని పూర్వ ప్రాథమిక విద్య మొదలుకొని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య, యూనివర్సిటీ స్థాయి వరకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి విద్యాప్రణాళికను రూపొందించి అభివృద్ధి చేయడానికి వీలుగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ జాతీయ సభ్యులు డా డివి రాయుడుతో ఇటీవల రచయితల వర్క్‌షాప్‌లో తయారు చేసిన డ్రాఫ్ట్ సిలబస్ గురించి చర్చించినట్లు పారినాయుడు తెలిపారు. శుక్రవారం గోరంట్ల లోని ఆర్.వై.ఎస్.ఎస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రచయితలతో పాటు ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆర్.వై.ఎస్.ఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.రామారావు తో కలిసి పూర్వ ప్రాథమిక నుంచి ఉన్నత పాఠశాల వరకు రెగ్యులర్ సిలబస్ కు అనుబంధంగా చేర్చాల్సిన అంశాల గురించి, ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక మీద చర్చించారు. కార్యక్రమంలో రచయితలు నల్లా బాలకృష్ణ, మంచిపల్లి గోపీనాథ్, చిత్రకారుడు తుంబలి శివాజీ పాల్గొన్నట్లు పారినాయుడు తెలిపారు. ఈ ప్రణాళిక అమలుకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సహకారంతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా కమిషనర్ పాఠశాల విద్యను కోరినట్లు పారినాయుడు తెలిపారు.

29న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజావక్తి - సీతానగరం

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న విజయవాడ ధర్నాను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యనారాయణ, ఆర్.తిరుపతి నాయుడు కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనం ఆవరణలో గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, డీఎస్సీను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని కోరారు

వాలంటీరుకు నియామక పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

ఇరిగేషన్ డిఇ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

చెంతనే జంఝావతి దిగువ కాలువ ఉన్నప్పటికీ నీరు లేక చేలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని, వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం అడ్డాపుశిల, వెంకటరాయుడిపేట గ్రామాలకు చెందిన రైతులు జంఝావతి డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి కార్యాలయం ఎదుట ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్ బంటు దాసు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ ఇంజనీర్ వేణుగోపాల్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోలెవెల్ కెనాల్ 21వ కాలువ వద్ద నీరు అందకపోవడంతో సుమారు 1500 ఎకరాల ఆయకట్టు పొట్ట దశలో ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కాలువ పరిస్థితిని పరిశీలించి సాగునీరు విడుదల అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు వర్షాలు లేకపోవడంతో జంఝావతికి ఇన్‌పుట్ ప్రవాహం తగ్గిందని, దీనివల్ల డిమాండ్ మేరకు నీటి సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. సరఫరా అయిన నీటిని రైతులు ఎక్కడికక్కడ ఇసుక బస్తాలు వేసి తమ చేలకు మళ్లించుకోవడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదని తెలిపారు. దీనిపై లస్కర్లను అప్రమత్తం చేసి శివారు భూములకు నీరందేలా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయు ధర్నా

ప్రజాశక్తి-పాలకొండ

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో ఎదుట మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి సిమ్మయ్య మాట్లాడుతూ డిపో స్పేర్ సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులకు అదే డిపోలో తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఒఆర్ తక్కువగా వస్తుందని, ఉద్యోగులను బదిలీ చేసే విధానాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. పగలు, రాత్రి డ్యూటీ అలవెన్సులను అదే నెల జీతంతో కలిపి ఇవ్వాలన్నారు. అర్హులందరికీ ప్రమోషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఉపాధ్యక్షులు పిఎల్ రావు, డిపో చైర్మన్ ఎల్ఆర్ రావు, కార్యదర్శి రాజేష్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఖాళీ ప్లేట్లు, తపాలాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

పెండింగ్‌లో ఉన్న మూడునెలల జీతాలు తక్షణమే చెల్లించి తమను ఆదుకోవాలని సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు.. గాంధీ విగ్రహం వద్ద ఖాళీ ప్లేట్లుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు చెల్లించకుండా పండగపూట పస్తులతో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూడు నెలలుగా నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో పస్తులతో కుటుంబాన్ని పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే తమకువేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిమ్మక శ్రీనివాస్, బిడ్డిక దవళేశ్వరరావు, నిమ్మక సుజాత, పి.హేమలత, బి.వసంతరావు, టి.నిరంజన్, ఎ.ప్రకాష్, ఎ. రాములు, ఎస్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల భర్తీపై వైసిపిలో అసంతృప్తి

ప్రాధాన్యత లేదని రాజీనామా యోచనలో కౌన్సిలర్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో ఏడు వాలంటీర్ పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎంపికైన వారికి శుక్రవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వార్డు కౌన్సిలర్ల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఏ వార్డులో ఉన్న వాలంటీర్ పోస్టును ఆ వార్డు కౌన్సిలర్ సిఫార్సు మేరకు ఇచ్చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర నిర్ణయించారు. వైసిపి అధికారంలోకి వచ్చి, మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత తమకు తగిన గుర్తింపు లేదని అధికార పార్టీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాలంటీర్ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడడంలో గాని, ఇతర అభివృద్ధి పనుల సిఫార్సులో గానీ ప్రాధాన్యత లేకుండా పోయిందనే అభిప్రాయంతో వారున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వార్డులో గల వాలంటీర్ పోస్టును ఆ వార్డు కౌన్సిలర్ సిఫార్సు మేరకు కేటాయించాలని రాజన్నదొర ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే పట్టణంలో రెండో వార్డులో ఖాళీ అయిన వాలంటీర్ పోస్టును రాజన్నదొర ఆదేశాల మేరకు ఆ వార్డు కౌన్సిలర్ పప్పుల లక్ష్మణరావు సిఫార్సు చేసిన అభ్యర్థికి ఇవ్వాలి. కానీ ఆ వాలంటీర్ పోస్టును ఇతర వార్డుకు చెందిన నాయకుల సిఫార్సు చేసిన అభ్యర్థికి ఇవ్వడంపై కౌన్సిలర్ లక్ష్మణరావు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మొదట కౌన్సిలర్ లక్ష్మణరావు సిఫార్సు చేసిన అభ్యర్థిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పేరు మార్చి ఇవ్వాలని రాజన్నదొర కోరారు. దీంతో ఆయన పేరు మార్చి ఇవ్వడానికి ప్రయత్నించగా రాజన్నదొర అమరావతి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ లక్ష్మణరావు చెప్పిన అభ్యర్థికి కాకుండా ఇతర వార్డు నాయకుల సిఫార్సు మేరకు కేటాయించారు. దీంతో కౌన్సిలర్ లక్ష్మణరావు తీవ్ర అసంతప్తి కి లోనై రాజీనామా యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ కౌన్సిలర్‌గా ఎన్నికై రెండున్నర ఏళ్ళు దాటినా వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా చేయించుకోలేని దుస్థితిలో ఉన్నానని, ఇలాంటి పదవిలో ఉన్నా లేకపోయినా ఒకటేనని ఆయన భావిస్తున్నారు. త్వరలో వార్డు పెద్దలు, నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి కిరణ్‌కుమార్

స్త్రీనిధి బకాయిల వసూళ్లకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

స్త్రీ నిధి బకాయిల వసూళ్లకు సిసిలు కృషి చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద ఎపిఎం ఐవి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడింగ్ పెంపు, స్త్రీ నిధి రికవరీ, స్త్రీ నిధి న్యూ లోన్స్ రిక్వెస్ట్, ఉన్నతి రికవరీ, మహిళా మార్ట్, లోకోస్ యాప్ సంబంధించి పంచాయతీ వారిగా సమీక్షించారు. వైయస్సార్ క్రాంతి పథకం ద్వారా అందుతున్న పథకాలు గూర్చి ప్రతి మహిళకు అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండలంలో గల సిసిలు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎపిడబ్ల్యుజెఎఫ్ మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా పైడి కొండలరావు (ఆంధ్రజ్యోతి), అధ్యక్షులుగా సరిపల్లి శ్రీనివాసరావు (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా పాలక ప్రేమానంద్ (95 న్యూస్), కార్యదర్శిగా బేత కుమారస్వామి (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసు రావు (టివి9), కోశాధికారిగా మద్ది నాని (ఎంఎం న్యూస్), పత్రిక ప్రతినిధి జి.పెంటయ్య (సాక్షి), మీడియా ప్రతినిధి టి.వినోద్ (ఎన్ టివి), సమాచార ప్రతినిధిగా కె.రాజా (10 టివి) ఎన్నికయ్యారు. సలహాదారులు వి నాయుడు (ఈనాడు), తూలుగు రవికుమార్ (ప్రజాశక్తి), విఎస్ ప్రకాష్ రావు (రాజ్ న్యూస్), కంచర రాము (వార్త), పి.రవికుమార్ (ప్రైమ్ 9), ఆరిక రాజు (నేటి రథసారథి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ మేళా

ప్రజాశక్తి - భామిని

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా భామినిలోని శ్రీ మన్నన్నారాయణ గ్రామీణ మిత్రక్ హెచ్‌పి గ్యాస్ కార్యాలయంలో ఉచిత గ్యాస్ కనెక్షన్ మేళా నిర్వహించారు. గతంలో ఏ గ్యాస్ కనెక్షన్ లేని వారికి, కొత్తగా రేషన్ కార్డు కలిగిన వారికి ఉచితంగా గ్యాస్ బండ, రెగ్యులేటర్, గ్యాస్ స్టవ్‌తో కూడిన గ్యాస్ కనెక్షన్ అందజేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి తర్వాత గ్యాస్ బుకింగ్‌లో రూ.500 వరకు సబ్సిడీ లభిస్తుందని, ఉచిత గ్యాస్ కనెక్షన్ కావాల్సిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో గ్యాస్ ఆఫీస్‌లో సంప్రదించాలని గ్యాస్ యజమాని కోరాడ రాజేష్ తెలిపారు. పూర్తి వివరాలకు 9550353626 సంప్రదించాలని తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'లో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - కురుపాం

మండల స్థాయిలో ప్రజా సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, ఆర్‌డిఒ కె.హేమలతతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం నిమిత్తం ఎవరూ జిల్లా కేంద్రానికి రాకుండా, జిల్లా అధికారులే ప్రజలకు అందుబాటులో వచ్చేందుకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 93 వినతులు రాగా వాటిలో ఎక్కువగా ప్రజలు తమ గ్రామ సమస్యలు, రోడ్లు, హౌసింగ్, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందజేశారు. వీటిలో కొన్ని....

స్థానిక మేజర్ పంచాయతీలో గల శివన్నపేటలో గల 30 ఎకరాల సోమసాగరం చెరువు సుందరీ కరణ పనుల నిమిత్తం జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్ , ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి వి.బంగారునాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గౌరీశంకర్ వినతిపత్రం అందించారు. సమస్య లపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు, సూచనలు చేశారు. కార్యక్రమం అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. నాడు-నేడు, హౌసింగ్, మంచినీటి సరఫరా పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు రక్తహీనత గల వారి జాబితా సచివాలయంలో ప్రదర్శిస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయాలని, రక్తహీనత గల వారిని సచివాలయం సిబ్బంది ఇద్దరూ లేక ముగ్గురు చొప్పున అప్పగించి, పర్యవేక్షణ చేసేలా చూడాలన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ చూపే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ఎంపిడిఒ వివి శివరామప్ప, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణపై వినతిని అందజేస్తున్న నాయకులు

ఎపిఎంకు వినతిని అందజేస్తున్న విఒఎలు

సమస్యలపై విఒఎల వినతి

ప్రజాశక్తి - పాచిపెంట

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎపిఎం జయకుమార్‌కు మండలంలోని విఒఎలు శుక్రవారం వినతిని పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఒఎల సంఘం నాయకులు పి.జయలక్ష్మి, కె.రూపని, సిహెచ్.హేమలత, కె.లక్ష్మి కుమారి మాట్లాడుతూ రూ. 10 లక్షల (గ్రూప్ ఇన్సూరెన్స్) సౌకర్యం కల్పించాలని, కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పనిభారం పెరుగుతున్నందున ప్రభుత్వమే మొబైల్ అధునాతనమైనవి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో అంకితభావంతో పనిచేస్తున్న తమను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, అధిక సంఖ్యలో విఒఎలు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా ఉన్న మర్రిపాడు-పూతికవలస రోడ్డు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు నుండి పూతిక వలస రహదారి దారుణంగా ఉంది. ప్రభుత్వం వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతి రావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు డిమాండ్ చేశారు. 550 మంది బాలిక హాస్టల్, 45 గిరిజన గ్రామాలకు అవసరమైన ఈ రోడ్డు మూడేళ్లుగా అధ్వానంగా తయారైందన్నారు. ముగ్గురు ఐటిడిఎ పిఒలు మారిన రోడ్డు పరిస్థితి మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ రోడ్డు పనులు చేపట్టి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఐటిడిఎ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జెఎఎస్ ఒక సువర్ణ అధ్యాయం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) ఒక సువర్ణ అధ్యాయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. జెఎఎస్ వైద్య శిబిరాన్ని మండలంలోని శిఖబడిలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తనిఖీ చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో దీన్ని ఉపయోగించుకుంటున్నారని ఆయన చెప్పారు. వైద్య నిపుణులు గ్రామాల్లోకి వచ్చి సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో పి.లేవిడి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ ఆధ్వర్యాన జరిగాయి. 521 రోగులకు వైద్య సేవలందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.అభినవ్‌కుమార్, లలితా, సత్య, సచివాలయ, వైద్య సిబ్బంది,104 సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కాశీపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ. జోగారావు మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధులకు ఈ శిబిరాల ద్వారా రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు ఇవ్వడమే కాకుండా వారికి ఆపరేషన్లు చేయాల్సి వస్తే ప్రభుత్వమే ఉచితంగా చికిత్స చేస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, సర్పంచ్ టి.జానకమ్మ, మాజీ జడ్పిటిసి వెంకట అప్పలనాయుడు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు ప్రజలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని దశమంతపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా 425 మందికి తనిఖీలు నిర్వహించినట్లు వైద్య అధికారులు పి ఉమామహేశ్వరి, ఎస్.నిఖిష, వైవి.రమణలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, వైద్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జనార్ధన్‌రావు, ఓ శాంతకుమారి, జ్ఞానమ్మ, విద్యానంద్, సచివాలయ సెక్రెటరీ సునీల్ కుమార్, విఆర్ఒ జి.రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి రామారావు, జడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వైద్యం అందుతున్న విధానంపై ఆరా తీశారు. వైద్య సహాయం పొందుతున్న వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఐడి)ను జారీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అంగన్వాడీస్టాల్‌ను పరిశీలించి ఎంతమంది గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారని అడిగారు. కార్యక్రమంలోఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి గోపాలరావు, వైసిపి నాయకులు అంబటి గౌరునాయుడు, అశోక్ బ్రహ్మ, బంకురు అప్పలనాయుడు, పిహెచ్సి వైద్యాధికారులు పి. ప్రియాంక, కె. అరుణ కుమారి, వైస్ సర్పంచ్ తెర్లి యల్లం నాయుడు,స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది,104 సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లుంబేసు లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి తోయక చిలకమ్మా ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి గిరిజనులు వచ్చి వైద్య సేవలు అందుకున్నారు.కార్యక్రమంలో ఎంపిటిసి మండంగి గౌరమ్మ, ఈవోపీఆర్డి జగదీష్ కుమార్, తాసిల్దార్ రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు జిపిఎస్ వేస్తున్న పౌరసరఫరా డిఎం నాయక్

వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

రానున్న ఖరీఫ్ సీజన్లో ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ తప్పనిసరని సివిల్ సప్లై డిఎం దేవుళ్ళ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సివిల్ సప్లై సిబ్బందితో కలిసి వాహనాలకు జియో ట్యాగ్ చేసే విధానాన్ని నిర్వహించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 3,800 వాహనాలను ధాన్యం సరఫరా కోసం ఇప్పటికే గుర్తించామని తెలిపారు. వాహనాల యజమానులు తప్పని సరిగా వాహనాలకు జియో ట్యాగ్ చేసుకోవాలని, లేదంటే వారికి రవాణా ఛార్జీలు చెల్లించమని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో 3లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాలో 7మండలాల్లో రాగులు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ

రక్షితమంచినీటి పథకం పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం తాళ్లడుమ్మలో రక్షిత మంచినీటి పథకం, సంపద సృష్టి కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, గ్రామీణ నీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒ.ప్రభాకర రావు తనిఖీ చేశారు. నాలుగు లక్షల రూపాయలతో నిర్మించిన అయిదు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మినీరక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. దాని పనితీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటిని వృథా చేయరాదని, కుళాయి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి, గ్రామంలో పారిశుధ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను విడదీసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - భామిని

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని తలడాలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్ట్, అక్రమ రిమాండ్‌లు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టిముక్కల కోటేశ్వరరావు, మండలం ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరావు, మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవి నాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, అంపిలి కేశవ,పాశర్ల నాగేశ్వరరావు, అగుతముడి గోవిందరావు, పోలాకి రాంబాబు, భామిని సర్పంచ్ లోపింటి రాజేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : చంద్రబాబునాయుడు అరెస్టు తీవ్ర అన్యాయమని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబుకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, అరుకు పార్లమెంట్ కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు మూడడ్ల సత్యం నాయుడు, కురుపాం నియోజకవర్గ తెలుగు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు లంక గోపాలం, నియోజకవర్గ వెలమ సంఘం అధ్యక్షులు రెడ్డి బలరాం స్వామినాయుడు, జనసేన మండల అధ్యక్షులు వారణాశి శివకుమార్, జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి పెంట శంకరరావు, నియోజకవర్గ ఐటి వింగ్ కో-ఆర్డినేటర్ ఎల్ రంజిత్ కుమార్, టిడిపి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ మల్లెమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అక్రమ అరెస్టు చేయడంతో నిరసన తెలిపారు.

జియ్యమ్మవలసలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబు అరెస్టు బాధాకరం

గుమ్మలక్ష్మీపురం: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు బాధాకరమని, జైలు లో పెట్టి 40రోజులైనా విడుదల చేయకుండా వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేస్తుందని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో ఎటువంటి తప్పు చేయకపోయినా 73ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తిని ఇలా బాధ పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి పాలన నడుస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు ఏం జరిగినా ముఖ్యమంత్రి జగన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. టిడిపి పక్షాన , చంద్రబాబుకు అండగా ప్రజలు ఉన్నారని తెలిపారు. వైసిపి పాలన పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో, కురుపాంలో టిడిపి విజయం సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

హమాలీలకు దసరా బోనస్ చెల్లించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లాలోని సివిల్ సప్లై కార్పొరేషన్ పరిధిలో గల 7పాయింట్లలో పనిచేసున్న దాదాపు 300 మంది హమాలీలకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల కూలీ రేట్లు, ఎగుమతి దిగుమతి ఛార్జీలు , దసరా బోనస్, స్వీట్ పాకెట్లు అందజేయాలని ఎపి సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కామేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దసరా బోనస్ గూర్చి ఆదేశాలు వచ్చి 15రోజులైనా ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. దీంతో పాటు యూనిఫారాలిచ్చి, వారికి కుట్టు కూలీ డబ్బులు ఇవ్వలేదన్నారు. హమాలీలకు ఇచ్చే కూలీ డబ్బులు ఇవ్వడంలో అధికారులు ప్రతిసారి ఇబ్బందులు పెడుతున్నారని, గట్టిగా అడిగితే తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. హమాలీల సమస్యలు పరిష్కారంలో జాయింట్ కలెక్టర్ కలుగ జేసుకొని వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

కురుపాంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక రావాడ కోటి జంక్షన్‌లో వెలిసిన కోట దుర్గమ్మ తల్లి నవరాత్రులు ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘనంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అంధవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 24న దసరా వరకు పూజా కార్యక్రమంలో రెండు పూటలా జరుగుతాయని తెలిపారు.

సీతంపేట : సాయిబాబా అవతార దినోత్సవ సందర్భంగా సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీరఘట్టం మండలంలో వృద్ధాశ్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిసిసి మేనేజర్ గొర్లె నరసింహులు, ఫకీరునాయుడు, రామకృష్ణ, అదుపాక రమణ, నారా భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చినభోగిలిలో గల ఇందిరా కాలనీకి చెందిన భవాణీ భక్తులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కురమాన రాధ, శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ చుక్క వెంకట నాయుడు, వైస్ సర్పంచ్ గంట రమేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

మృతదేహాలను శ్మశానానికి తీసుకువెళ్లాలన్నా, అటువైపు పొలాలకు వెళ్లాలన్నా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని స్వామినాయుడువలసలో శుక్రవారం శ్మశానానికి రహదారి సదుపాయం కల్పించండని, రైల్వే లైన్ కింద అంతర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ శవాన్ని మోసుకుంటూ నినాదాలు చేస్తూ శ్మశానానికి వెళ్ళారు. ఈ సందర్భంగా కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ మృతదేహాన్ని కొత్తగా నిర్మించిన మూడో రైల్వే ట్రాక్‌పై మోసుకుంటూ స్మశానానికి రహదారి లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతూ రాళ్లపై నడుచుకొని ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యపై కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చినప్పటికీ స్పందించలేదన్నారు. ఇప్పటికే రెండు రైలు పట్టాలు దాటుకొని శవాన్ని తీసుకొని వెళ్లే సందర్భంలో అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని తెలిపారు. ఇలాంటి సందర్భంలో మూలిగే నక్కపై తాటి పండు పడేలా మళ్లీ మూడో లైన్ ప్రారంభిస్తే మూడు రైలు పట్టాలు దాటి శ్మశానానికి శవాలు తీసుకొని వెళ్లాలంటే ప్రమాదకర పరిస్థితి ఎదురవుతుందన్నారు. కావున రైల్వే శాఖ అధికారులు స్పందించి అంతర్ బ్రిడ్జి నిర్మించి శ్మశానానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో కలిసి కోరుతున్నామని, లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్మశానాన్ని మోసుకుంటూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చేపపిల్లలను విడిచిపెడుతున్న అధికారులు

చెరువుల్లో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వెంగాపురం, మరియు వంతరాం మత్సకార సహకార సంఘం ఆధ్వర్యాన 10 చెరువుల్లో సుమారు 90 వేల చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు మత్స శాఖ అభివృద్ధి అధికారి వై శ్రీదేవి, సహాయకులు ఎ.కీర్తి ప్రియ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సుమారు 7 సొసైటీలకు చెందిన సొసైటీ లబ్ధిదారులకు వీటి పెంపకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వారు తెలిపారు. వీటి పరిరక్షణ ఆయా సొసైటీ సభ్యుల సమక్షంలో జరుగుతుందని, సంబంధిత సహాయ సహకారాలు ప్రభుత్వ సహకార సంఘం ద్వారా అందాయని వారు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

చక్కని విద్యాబుద్ధులు నేర్పించాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత చదువులు చదివేందుకు సహకరించి ఆశీర్వదించాలని చింతలగూడ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సరస్వతి దేవి పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఈ పాఠశాలలో సరస్వతి పూజను నిర్వహిస్తుంటామని పాఠశాల మేనేజర్ బేతా కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. దసరా సెలవులు అయినప్పటికీ పాఠశాల విద్యార్థులంతా నిబద్ధతతో సరస్వతిదేవి పూజలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుమారస్వామి, వాలంటీర్లు ప్రశాంతి, సునీత పాల్గొన్నారు.

పశువుల శాలగా మారిన అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

పశువుల దొడ్డి కాదు...

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో పశువులతో నిండి ఉన్న ఈ భవనాన్ని చూస్తే ఎవరికైనా ఏదైనా డైరీ ఫార్మ్ పెట్టుకున్నారేమో అనిపించక మానదు... కానీ అది నిజం కాదు.. అంగన్వాడీ కేంద్రం కోసం గత కొంతకాలంగా నిర్మించి అర్థాంతరంగా వదిలేసిన భవనం ఇది. దీని గురించి అటు అధికారులు గానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంతో కొందరు దీన్ని పశువులకు ఆవాసంగా మార్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని అంగన్వాడీ కేంద్రంగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు

నేడు మంత్రుల రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున శనివారం జిల్లాకు రానున్నారు. ఆరోజు తెల్లవారు ఝామున నగరానికి చేరుకొని ఉదయం 10 గంటలకు రెవెన్యూ కళ్యాణ మండపంలో బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లనున్నారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం జిల్లాకు వచ్చారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎల్.కోటలో జరిగే నియోజకవర్గ స్థాయి బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎల్. కోట నుంచి విశాఖ బయలుదేరి వెళ్లనున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎఇ బి.శంకరరావు తెలిపారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బొడ్లపాడు గ్రామ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైనట్లు ఎస్సై ఎంవి రమణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాపంపేటకు చెందిన శంకర్రావు, ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వీరఘట్టం నుండి పాలకొండ వైపు వెళ్తున్న కారును తప్పించిపోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ సంఘటనలో వీరిద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు పంచాయతీ పిట్టపేట గ్రామానికి చెందిన పిట్ట సూర్యనారాయణ (56) క్రేన్ ఢీకొని శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి కథనం ప్రకారం.. ముంజేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షలు చేసుకునేందుకు సూర్యనారాయణ సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. ఇంతలో పిట్టపేట జంక్షన్ వద్ద ముక్కాం వైపు నుంచి భోగాపురం వెళుతున్న క్రేన్ ఢీకొట్టింది. దీంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సూర్యనారాయణకు భార్య వెంకటలక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.